# సింగిల్ పేజీ కథలు

## అలక

''ఏయ్ గీతా ఇప్పుడేమయ్యిందని ఏడుపు? మళ్లీ వస్తాం కదా'' గీత పెద్దాడబడుచు రాజేశ్వరి గీత వెనకాల తిరుగుతూ సముదాయిస్తుంది.

''ఏంటక్కా మళ్లీ రావడం. మేము కాపురం పెట్టిన తరువాత అందరూ కలసి రావడం ఇదే మొదటిసారి. వచ్చిన నాలుగోరోజే ప్రయాణం అంటే ఏడ్పురాదా. ఇదంతా శాంతక్క వల్లే జరిగింది'' ఉక్రోషంగా అంటూ మొహమంతా కందగడ్డలా చేసుకొని పని లేకపోయినా ఆ గదిలో నుండి ఈ గదిలోకి, ఈ గదిలో నుండి ఆ గదిలోకి తిరిగేస్తూ అంది గీత. గీత ఎంత స్పీడుగా తిరుగుతుందో రాజేశ్వరి కూడా అంత స్పీడ్‌గానూ గీత వెనకాల తిరుగుతూ బ్రతిమాలుతూనే ఉంది.

రాజేశ్వరి, శాంతి, భవాని అక్కచెల్లెళ్ళు. వీళ్ల మేనమామ కూతురు గీతను తమ్ముడు రాముకి చేసారు. అందువల్ల వదినా ఆడబడుచుల్లా ఉండకుండా అక్కచెల్లెళ్ల మాదిరిగా ఉంటారు. ఆడబడుచులు ముగ్గురినీ 'అక్కా' అనే పిలుస్తుంది గీత. గీతది మంచి మనసు. కొంచెం ఉక్రోషం ఎక్కువ. ఏదన్నా మాట ఉంటే మొహం మీద చెప్పేస్తుంది. కోపం వచ్చినా వెంటనే కరిగిపోయే వెన్న లాంటి మనసు.



ప్రస్తుతం కోపానికి కారణమైన శాంతి అప్పటికే సామాను సద్దుకొని కార్లో కూర్చుని ఉంది. ఇంత కోపం పెట్టుకొంటుందని తెలియక ప్రయాణమయ్యారు. పరవాడ ఎన్.టి.పి.సి. క్వార్టర్స్ నుండి మాధవధార అన్నయ్యగారి ఇంటికి బయలుదేరారు. అసలు ఈ ప్లాను ముందుగానే వేసుకొన్నారు. మూడు రోజులు పరవాడలోనూ మూడు రోజులు సిటీలోనూ ఉండాలని. తీరా బయలుదేరే సమయానికి మరదలి అలక. ఏం చెయ్యాలి?

గీతకు మాత్రం ఊళ్లోనే ఉన్న తోటికోడలిని, బావగారిని కూడా పిలిచి అందరం కలిసి పరవాడలోనే ఉండాలని కోరిక.

ఏది ఏమయితేనేమి? రాజేశ్వరి బ్రతిమలాటతో లొంగి కారు వద్దకు వచ్చింది సెండాఫ్ ఇవ్వడానికి గీత. శాంతిని పట్టించుకోకుండా శాంతి పక్కనే కూర్చుని ఉన్న తోటికోడలు రమణితో-

''అక్కా...మీ అమ్మగారు ఫోన్ చేస్తే అడిగినట్లు చెప్పు'' అంటూ సాగనంపింది.

శాంతికి కూడా మనసులో పీకులాట. 'ఛ. పాపం గీతను నొప్పించాను. దిగిపోదామా అన్పిస్తుంది. కానీ ఒక్కరోజన్నా అన్నయ్యగారింట్లో గడపాలన్న ఆశ. ఒక పక్క రేవతీ, గాంధీ- రామకృష్ణ బీచ్ చూపించమని గొడవ.'

ఇవేమీ పట్టనట్లు తమ్ముడు రాము మాత్రం చిద్విలాసంగా స్టీరింగ్ ముందు ఎప్పుడు సెండాఫ్ కార్యక్రమాలు అవుతాయా? ఎప్పుడు కారు స్టార్ట్ చేద్దామా అని ఎదురుచూస్తున్నాడు.

అన్నయ్య ఇంటికి వెళ్లిందే కాని మనసంతా మరదలి మీదే ఉంది శాంతికి. ఛ. తను అనవసరంగా గీతను కష్టపెట్టింది. ఎంత ప్రేమాభిమానాలు లేకపోతే అంతలా ఏడ్చి గోల చేస్తుంది.

సాయంకాలం తమ్ముడు ఇంటికి వెళ్లేటప్పుడు రమ్మని చెప్పి అందరూ అన్నయ్యగారి ఇంటివద్ద దిగారు.

సిటీకి వచ్చినందుకు మాత్రం పిల్లలు చాలా ఆనందపడ్డారు. వాళ్లను తీసుకొని దగ్గరలో ఉన్న షాపింగ్‌కి, బీచ్‌కి తీసుకువెళ్లి వచ్చారు. తిరిగి వచ్చేసరికి రాము పని ముగించుకొని వచ్చి ఉన్నాడు.

అక్కచెల్లెళ్లు ముగ్గురూ డిస్కషన్స్ పెట్టుకొని చివరకు రాజేశ్వరి, శాంతి తిరిగి గీతను ప్రసన్నం చేసుకోడానికి తమ్ముడితో కలిసి వెనక్కు వెళ్లడానికి నిర్ణయించుకొన్నారు.

కారు దిగుతున్న ఆడబడుచులను చూసి గీత పరుగు పరుగున వచ్చి కౌగిలించుకుంది. ప్రొద్దుటి కోపం అంతా ఏమయిపోయిందో? ప్రసన్నంగా ఉంది మొహం.

హరీష్, బిందు 'అత్త వచ్చింది అత్త వచ్చింది' అంటూ సంతోషంగా గంతులు వేశారు.

''నాకు నీ మీద చాలా కోపం వచ్చిందక్కా'' శాంతి వెనకాల చేరి భుజాల మీద చేతులు వేస్తూ అంది గీత.

''గీతా.. అంత కోపం ఉండకూడదమ్మా. ఒక్కోసారి పరిస్థితిని బట్టి ప్రోగ్రాం మారుతూ ఉంటుంది. బిందు, హరీష్ ఉండేది ఒక్క వారం రోజులు. నువ్వు వాళ్లతో కూడా స్పెండ్ చెయ్యాలి కదా. ఖర్చుకు ఖర్చు. పని. అంతా ఎక్కువయ్యి నీకు కష్టం అవుతుందని ఆలోచించాము. నువ్వేమో అలిగి కూర్చున్నావు. మేము అందరం కలిసి పిల్లలతో సహా ఎనిమిది మందిమి అయ్యాము. నీకు కష్టం అని ఆలోచించాను'' శాంతి ఆగింది.

''నీ ఆలోచనలు కరెక్ట్‌గానే ఉంటాయక్కా. కానీ మన ఇంటి పరిస్థితులు ఎప్పుడూ ఉండేవే. ఇంట్లో అందరం కలిసి ఉండటమంటేనే నాకు చాలా ఇష్టం. అందుకే అట్లా ఉక్రోషపడ్డాను'' సిగ్గుపడ్డట్లుగా చెప్పింది గీత.

'అనుబంధాలకి, ఆత్మీయతకు మారుపేరు ఈ వదినాఆడబడుచుల అనుబంధం. ఒకరి మీద ఒకరికి ఎంత ప్రేమ లేకపోతే, ఎవరూ సమస్యను తమ వైపు నుండి కాకుండా ఎదుటి వాళ్ల వైపు ఆలోచించరు. అటువంటి ఈ వదినా ఆడబడుచులు ఒకరి గురించి ఒకరు ఆలోచించి ఇంకా దగ్గరయ్యారు' అనుకున్నాడు రాము.

-ప్రభా సుబ్బారావు (బెంగుళూరు)